# ప్రజారక్షణ ప్రాంతీయం


గురువారం 10-9-2026 | పేజీలు : 4




## పోలీసులు దాడి చేసిన తీరును గవర్నర్‌కు వివరించాం : కేటీఆర్

**హైద్రాబాద్, సెప్టెంబర్ 9 :** అసెంబ్లీ ముందు మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేసిన దాడి చేసిన తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆధ్వర్యంలో ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ లాంటి పరిస్థితిని వివరించడానికి వారిని సమయం అడిగాం.. మాకు సమయం ఇచ్చారు. వారికి మా పార్టీ పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. వారికి చిన్న ఆరోగ్యసమస్య వచ్చింది.. వారు సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా మా పార్టీ తరపున ఆకాంక్షను తెలియజేశామన్నారు. ఇవాళ ఈ రాష్ట్రంలో నెలకొన్ని అన్ని పరిస్థితులను గవర్నర్‌కు కూలంకషంగా మా పార్టీ శాసనసభ్యులు, శాసన మండలిలో ప్రతిపక్ష నాయకులు, ఉప నాయకులు, సీనియర్ నాయకులు అంతా కలిసి చాలా వివరంగా గవర్నర్‌కు చెప్పామన్నారు. రాజకీయ వార్తలు చదవండి కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనలో ప్రజలకు అన్యాయమే జరిగిందని నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలుపుతుంటే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీకి రానివ్వకుండా పోలీసులు దాడి చేసిన తీరును, తెలంగాణలో పరిస్థితులను గవర్నర్‌కు వివరించామన్నారు. శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిపై పురుష పోలీసుల దాడి వీడియోలను చూపించాం. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను తెలిపామన్నారు.

## ఫాంహౌస్‌లో కుట్రపై
# సమగ్ర విచారణ
## సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :** బీఆర్ఎస్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాంహౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందిం చారని ఆరోపించారు. సభను అడ్డుకోవాలని బీఆర్ఎస్ సభ్యులు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు. మూడు రోజుల ఘటనలకు ఫాంహౌస్ సాక్షిగా కుట్ర జరిగిందని ఆరోపించారు. అసెంబ్లీ ఘటనలపై విచారణకు ఆదేశించామని అన్నారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం.. విద్వేషాలు, అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని హెచ్చరించారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని.. చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుట్ర చేసిన వారితో పాటు అమలు చేసిన వారిని.. కోర్టులో నిలబెట్టి శిక్షించాలని నిర్ణయించామని అన్నారు.

**విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్..**

ఈ ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్‌ను నియమించామని వెల్లడించారు. ఈనెల 6వ తేదీన ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని ఆరోపించారు. 7వ తేదీన స్పీకర్‌పై మాటల దాడి జరిగిందని అన్నారు. 8వ తేదీన శుద్ధి కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు.. కుట్ర చేసిన అందరిపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కోర్టు బెయిల్ ఇవ్వొచ్చేమో గానీ.. సమాజం మాత్రం బెయిల్ ఇవ్వదని చెప్పారు. అసెంబ్లీ ఘటనలపై విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు.

**కేసీఆర్ కుట్ర పన్నారు..**

ప్రజా సమస్యలపై చర్చ కోసమే తాము అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 22ఏ భూములు సహా అన్ని అంశాలను చర్చించాలనుకున్నామని పేర్కొన్నారు.



## బీఆర్ఎస్ సభ్యుల
# సస్పెన్షన్..
### ఈ సెషన్ మొత్తం సస్పెండ్ చేస్తూ తీర్మానం

**హైద్రాబాద్,సెప్టెంబర్ 9 :** అసెంబ్లీ సమావేశాల తొలి రోజు నుంచే రేవంత్ ప్రభుత్వం నిర్బంధకాండ కొనసాగుతోంది. హామీల అమలుపై ప్రశ్నించినందుకు తొలిరోజే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేయించింది. ఇవాళ మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనలపై నిలదీసినందుకు సభ నుంచి సస్పెన్షన్ వేటు వేసింది. 17 మంది బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారు. ఈ సెషన్ ముగిసేంత వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతోందని తీర్మానం చేశారు. దీనిపై మిగతా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. సభ లోపలే తమ నిరసనను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు.

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బుధవారం నాడు తమ ఎమ్మెల్యేలు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానంపై చర్చకు అనుమతించాలని కోరుతూ బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఇచ్చిన వాయిదా తీర్మానంపై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'వీ వాంట్ జస్టిస్' అంటూ సభలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోడియం వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు.

## తెలంగాణలో బీజేపీ గెలుపును
# ఎవ్వరూ ఆపలేరు
### బండి సంజయ్

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9:**



తెలంగాణలో బీజేపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. బుధవారం భద్రాచలంలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి.. బీజేపీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల తరువాత బీజేపీ అధిష్ఠానం టార్గెట్ తెలంగాణ అని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి బీజేపీ కార్యకర్త పై అక్రమ కేసులు పెట్టి వేధించారని మండిపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇచ్చే ఇళ్లు, సన్న బియ్యాన్ని కాంగ్రెస్ గొప్పగా చెప్పుకుంటోందని బండి సంజయ్ విమర్శించారు. కేసీఆర్ మెడలు వంచింది బీజేపీ పార్టీ అని అన్నారు.

# ప్రయాణానికి సిద్ధమైన ఎన్‌హెచ్-563

- రూ.1,641 కోట్లతో హనుమకొండ-కరీంనగర్ నాలుగు వరుసల జాతీయ రహదారి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ నాయకత్వంలో అభివృద్ధికి మచ్చుతునక
- యాదగిరి సునీల్ రావు





ప్రజా రక్షణ/కరీంనగర్ ప్రతినిధి
భారత్‌మాల పరియోజన పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.1,641 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన హనుమకొండ-కరీంనగర్ జాతీయ రహదారి ఎన్‌హెచ్-563 ప్రయాణానికి పూర్తిగా సిద్ధమైందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఈ రహదారిని అధికారికంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. 68 కిలోమీటర్ల మేర నాలుగు వరుసలుగా నిర్మించిన ఈ జాతీయ రహదారిలో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రహదారిపై వాహనాల ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారని, అది విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.

**గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం..**

ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గేలా, వాహనాలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యంతో రహదారిని ఆధునిక ప్రమాణాలతో నిర్మించారని సునీల్ రావు తెలిపారు. హనుమకొండ--వరంగల్ నుంచి కరీంనగర్ వరకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గి సుమారు 45 నిమిషాలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్ ప్రాంతాల ప్రజలు కలలు కన్న రహదారి నేడు సాకారమవుతోందని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు.

**9 భారీ ఫ్లైఓవర్లు 25 అండర్‌పాస్‌లు**

ఈ జాతీయ రహదారిలో 9 భారీ ఫ్లైఓవర్లు, వంతెనలు, 23 చిన్న వంతెనలు, 25 అండర్‌పాస్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శంకరపట్నం, మానకొండూర్, హుజూరాబాద్ తదితర ప్రాంతాల్లో బైపాస్ రోడ్లను ఏర్పాటు చేస్తూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రహదారిని డిజైన్ చేసినట్లు వివరించారు. రోడ్డు భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని, సీసీ కెమెరాలు, సోలార్ లైట్లు, ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించేలా అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ వంటి సాంకేతిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు సునీల్ రావు తెలిపారు.

**బండి సంజయ్ నాయకత్వంలో అభివృద్ధికి మచ్చుతునక**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని సునీల్ రావు అన్నారు. గ్రామాల నుంచి నగరాల వరకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కరీంనగర్ నగర అభివృద్ధికి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా నిధులు తీసుకురా వడంతో పాటు అమృత్-1, అమృత్-2 పథకాల ద్వారా కూడా అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. నగరాన్ని మరింత అభివృద్ధి చేసేం దుకు యూఐడీఎఫ్ పథకం కింద రూ.840 కోట్ల నిధులు తీసుకురావడం గర్వకారణమన్నారు.

**కరీంనగర్-జగిత్యాల రహదారికి రూ.2 వేల కోట్లు**

త్వరలో కరీంనగర్--జగిత్యాల జాతీయ రహదారిని కూడా ఇదే స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు సునీల్ రావు తెలిపారు. దాదాపు రూ.2 వేల కోట్ల నిధులతో పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, రాబోయే రెండేళ్లలో ఈ రహదారి కూడా ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే యూఐడీఎఫ్ పథకం ద్వారా రూ.180 కోట్లతో పాటు మరో రూ.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు, అదనంగా రూ.30 కోట్ల యూఐడీఎఫ్ నిధులను తీసుకురావడానికి చర్యలు జరుగుతున్నాయని తెలిపారు.

**మరిన్ని అభివృద్ధి పనులు పరుగులు పెడతాయి**

రాబోయే మూడేళ్లలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మరింత వేగం పుంజుకుంటాయని సునీల్ రావు అన్నారు. వేలాది కోట్ల రూపాయల కేంద్ర నిధులను తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే ముందుచూపుతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో చూపిస్తున్న నాయకత్వానికి ఎన్‌హెచ్--563 నిర్మాణం నిదర్శనమన్నారు. హనుమకొండ--వరంగల్ నుంచి కరీంనగర్ వరకు నిర్మించిన ఎన్‌హెచ్--563 జాతీయ రహదారి ప్రస్తుతం ట్రయల్ రన్ దశలో ఉందని, ట్రయల్ రన్ విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో త్వరలో అధికారికంగా ప్రారంభించి ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు యాదగిరి సునీల్ రావు తెలిపారు. కరీంనగర్ జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భారీ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు జిల్లా ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### నేమురి శంకర్ అక్రమ అరెస్టులకు నిరసనగా

## జనసేన పార్టీ నాయకులు ధర్నా

ప్రజా రక్షణ/కరీంనగర్ టౌన్
జనసేన పార్టీ నాయకులు కందుల రాజి రెడ్డి ఆధ్వర్యంలో జనసేన రాష్ట్ర అధ్యక్షులు నేమురి శంకర్ అక్రమ అరెస్టుకు నిరసనగా కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ చౌరస్తాలో జనసేన పార్టీ నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాజి రెడ్డి మాట్లాడుతూ అక్రమ అరెస్టులు ప్రభుత్వ పనితీరుపై విరుచుకుపడ్డారు ప్రజలకు ఇబ్బంది కలిగి అనేక సమస్యలు ఉండగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అక్రమ అరెస్ట లు చేస్తున్నారని 22 ఏ జీవో ఎత్తివేయకుండా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రజల దృష్టిని మరలించడానికి ఈ అరెస్టుల పర్వం కొనసాగుతుందని ఇలాంటి చర్యలు తగదని ఈ అరెస్టులు ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో ఉద్యమం చేపడతామని తెలంగాణ గురించి ఏ విధంగా కొట్లాడినమో కాంగ్రెస్ ప్రభుత్వానికి గద్దదించేందుకు కూడా అదే విధంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెరిచి 22ఏ భూములను పరిష్కరించే విధంగా అలాగే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు ఉద్యమం చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం ఇంచార్జ్ మొగిలిపాలెం రమేష్. కరీంనగర్ మున్సిపల్ కాంటెస్టెంట్ కార్పొరేటర్ అభ్యర్థులు. పొన్నాల తిరుపతి. వీర్ల శ్రీనివాసరావు. అంబాల సృజన్ కుమార్ జంగ మహేష్. జనసేన నాయకులు మహాదేవుని రాజ్ కుమార్ గాలిపెల్లి కుమార్. పాతూరి వేణుగోపాల్ రెడ్డి తరుణ్. వికాస్. ప్రవీణ్. పవన్ జనసేన వీర మహిళలు తోడేటి భారతి కుంట సుజాత పాల్గొన్నారు..

## అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ..

### వైద్య సేవలు, రికార్డులు, మందుల నిల్వల పరిశీలన

ప్రజా రక్షణ/కరీంనగర్ ప్రతినిధి
కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్‌రావు బుధవారం కట్టరాంపూర్, సప్తగిరి కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లోని పలు రికార్డులు, మందుల నిల్వలు, వ్యాధి నిరోధక కార్యక్రమాల అమలు తీరును తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఎన్‌సీడీ రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్‌తో పాటు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు నిల్వ చేసే ఐఎల్ఆర్ (ఇన్సులేటెడ్ లైన్డ్ రిఫ్రిజిరేటర్)ను పరిశీలించారు. ఐఎల్ఆర్‌లో టీకాల నిల్వకు సంబంధించిన రోజువారీ ఉష్ణోగ్రత రికార్డుల నమోదును కూడా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, చికిత్స విధానం, మందుల పంపిణీ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామపంచాయతీ స్థాయిలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ప్రతి వారం సమావేశం నిర్వహించాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఫీవర్ సర్వే, వైద్య శిబిరాల నిర్వహణ, ఫైలేరియా కేసుల ఫాలోఅప్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను తొలగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరాలకు సంబంధించిన శాంపిళ్లను క్రమం తప్పకుండా టీ-హబ్‌కు పంపించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు నిర్వహించనున్న మెడికల్ క్యాంపుల తేదీలు, ప్రదేశాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వనరుల సంరక్షణ, వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాము కాటు, కుక్క కాటు చికిత్సకు అవసరమైన మందులు, ఇతర అత్యవసర ఔషధాలను ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. 13 సంవత్సరాలు పైబడిన వారికి ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపుల్లో నిర్వహించిన స్క్రీనింగ్‌ను పునఃసమీక్షిస్తూ అవసరమైన వారికి రీ-స్క్రీనింగ్, ఫాలోఅప్ చేయాలని తెలిపారు. అలాగే 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిరాజ్, డాక్టర్ సాఫర్ హుస్సేన్‌తో పాటు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యశ్రీ నీ అభినందించిన జిల్లా కలెక్టర్




మెదక్ సెప్టెంబర్ 09

కరాటేలో 16 స్టేట్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్స్ ,4 ఛాంపియన్‌షిప్ సాధించిన మెదక్ పట్టణాని కి చెందిన నిత్యశ్రీ ని అభినందించి, శాలువా తో సత్కరించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకోవాలని విద్యార్థికి సూచించారు. నగేష్ మల్లారి సారథ్యం లో శిక్షణ తీసుకొని పతకాలన్నీ సాధించా నని,ఇంటర్నేషనల్ బ్రూస్లీ ఐకాన్ అవార్డ్ సైతం సొంతం చేసుకున్నానని నిత్యశ్రీ అన్నారు.

## గణేష్ ఉత్సవాల నిర్వహణపై పకడ్బందీ ప్రణాళిక

### నిర్వాహకులకు డీఎస్పీ నరేందర్ గౌడ్ కీలక సూచనలు




తూప్రాన్, సెప్టెంబర్ 09

వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు తూప్రాన్ పోలీసులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తూప్రాన్ పట్టణంలోని లింగారెడ్డి గార్డెన్స్‌లో వినాయక ఉత్సవాల నిర్వాహకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.తూప్రాన్ సర్కిల్ పరిధిలోని తూప్రాన్, మనోహరాబాద్, శివంపేట్, వెల్దుర్తి మండలాలకు చెందిన వినాయక ఉత్సవాల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. ఉత్సవాల సందర్భంగా ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడంలో నిర్వాహకుల సహకారం ఎంతో కీలకమని అన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఊరేగింపులు నిర్వహించాలని సూచించారు.మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసు శాఖతో పాటు సంబంధిత అధికారుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు.భక్తి భావనకు భంగం కలగకుండా, ప్రజల భద్రతకు విఘాతం లేకుండా, శాంతిభద్రతలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు కోరారు.సమన్వయంతో ఉత్సవాలు నిర్వహిస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేయవచ్చని డీఎస్పీ పేర్కొన్నారు.ఈ సమావేశంలో తూప్రాన్ సీఐ వెంకటరాజా గౌడ్, ఎస్ఐ వి. గంగరాజు, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్, శివంపేట్ ఎస్ఐ మధుకర్ రెడ్డి, వెల్దుర్తి ఎస్ఐ కర్నాకర్ రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ రమేష్, ఎంఆర్ఓ, విద్యుత్ శాఖ ఏఈతో పాటు వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ పోస్టులపై విచారణ జరిపించాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్




ప్రజా రక్షణ/కరీంనగర్ ప్రతినిధి

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రోజున ఔట్ సోర్సింగ్ పోస్టులపై విచారణ జరిపించాలి అని వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ కి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ యూనివర్సిటీలో జరుగుతున్న అవక తవకలపై సమగ్ర విచారణ జరిపించాలి మరియు ఔట్సోర్సింగ్ నియామకాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 36 మంది పైగా వ్యక్తులకు పోస్టింగ్ ఇవ్వడం జరిగింది దానికి ఎలాంటి ఆర్డర్ ఇవ్వకుండా పోస్టింగ్ ఇవ్వడం మరియు దీనిపైన ఒక అడ్వర్టైజ్మెంట్ ఇవ్వకపోవడం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దేనికి సంకేతం అని వారు వైస్ చాన్సలర్ ని ప్రశ్నించారు. నియమాకాలలో పూర్తిస్థాయిలో దోపిడీ జరిగిందని స్పష్టంగా కనబడుతుంది అర్హత లేని వారికి అవకాశాలు ఇవ్వడం పూర్తిగా రాజకీయ ప్రలోభాలకి గురైనట్టు స్పష్టంగా కనిపిస్తుందని వారు అన్నారు. పోస్టులను అమ్ముకోవడానికి ప్రోత్సహిస్తున్న వారు ఎవరు దానికి ముఖ్య కారకులు ఎవరు పోస్టులు అంగట్లో సరుకుల మాదిరిగా అమ్ముకుంటూ నియామకాలను చేపడితే అది ఏవిధంగా సమంజసం దీనిపైన ఉన్నతాధికారులు స్పందించి విచారణ వేగవంతం చేసి అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయమయ్యే విధంగా అధికార యంత్రాంగం ప్రభుత్వం పాటుపడాలని కోరారు. శాతవాహన విశ్వవిద్యాలయం అంటేనే అవినీతికి అడ్డాగా మారిపోయింది దీనిపైన రకరకాల సమస్యలు ఉన్నాయి పూర్తి స్థాయిలో వాటిని పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతావని వారు హెచ్చరించారు. అదేవిధంగా రిటైర్డ్ అయిన వారిని విధులలో కొనసాగించడం దేనికి సంకేతం రిటైర్డ్ అయిన వారిని విధుల్లో నుండి తొలగించాలి కొత్త రిక్రూట్మెంట్ ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ నియామకాలని చేపట్టాలి పూర్తిస్థాయిలో యూనివర్సిటీ అభివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు. వైస్ చాన్సలర్ గారు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే ఉన్నత విద్యా మండలి చైర్మన్ ని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలియచేశారు. ఔట్సోర్సింగ్ నియామకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి దానికి పాల్పడిన వారు ఎవరైనా సరే వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు యూనివర్సిటీనీ అభివృద్ధి చేసుకొని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్, నవీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినయ్ బోగేష్ , నాయకులు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులను ఖండించిన సర్పంచులు




కొల్చారం, సెప్టెంబర్ 09

పాత పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్న టీఆర్ఎస్ పార్టీ తాజా మాజీ సర్పంచులు, కారుణ్య నియామకాలు చేపట్టాలని పోరాడుతున్న వీఆర్ఏలు, జీతాలు పెంచాలని కోరు తున్న అంగన్వాడీలను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ అరెస్టులను కొల్చారం మండల సర్పంచుల పురం అధ్యక్షు యాబన్న గారి రవితేజ రెడ్డి,ప్రధాన కార్యదర్శి దొడ్ల ఆంజనేయులు ఖండించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి, వీఆర్ఏల కారుణ్య నియామకాలు చేపట్టి, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు మోహన్, వినోద్ నాయక్, బి ఆర్ ఎస్ నాయకులు అరిగే విజయ్‌కుమార్, రమేష్, పుర్రె ప్రభాకర్, సందీప్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల 'చలో హైదరాబాద్'కు పోలీసుల అడ్డుకట్ట

### శాంతియుత ధర్నాకు బయలుదేరిన టీచర్ల ముందస్తు అరెస్టులు.. ప్రభుత్వంపై అంగన్వాడీల ఆగ్రహం




వెల్దుర్తిమండలం,సెప్టెంబర్ 09

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా గళం విప్పేందుకు హైదరాబాద్ బాట పట్టిన అంగన్వాడీ టీచర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.'చలో హైదరాబాద్' కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన అంగన్వాడీ టీచర్లను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకు న్నారు. అంగన్వాడీ టీచర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుత మార్గంలో నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను ముందస్తుగా అరెస్టు చేయడంపై అంగన్వాడీ యూనియన్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.తమ డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిరసన గొంతుకను అణచివేసే ప్రయత్నం చేయడం సరికాదని వారు మండిపడ్డారు. అంగన్వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, తమ న్యాయమైన డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అంగన్వాడీ నాయకులు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# భక్తితో బోనాలు నిర్వహణ.. గ్రామస్తుల గుండెల్లో చెరగని ముద్ర

### వనం దుర్గన్న ఇక లేరు.. ఆయన లేని లోటుతో గ్రామస్తులు కన్నీటి పర్యంతం

**రేగోడు, సెప్టెంబర్ 9 :**





రేగోడు గ్రామానికి చెందిన వనం దుర్గన్న అలియాస్ 'బోనం దుర్గన్న' మృతి గ్రామస్తులను తీవ్ర విషాదంలో ముంచింది. అందరితో కలుపుగోలుగా ఉంటూ, చిన్నప్పటి నుంచే భక్తిభావంతో జీవించిన దుర్గన్న ప్రతి ఏడాది బోనాల కార్యక్రమాన్ని తన చేతుల మీదుగా నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ భక్తిశ్రద్ధలతో బోనాల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ గ్రామంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. బోనాల సమయంలో ఆయన పాల్గొనడం, భక్తి పరవశంతో కార్యక్రమాలను నిర్వహించడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. దీంతో గ్రామస్తులు ఆయనను ఆప్యాయంగా 'బోనం దుర్గన్న'గా పిలుచుకునేవారు. అయితే దుర్గన్న మృతి చెందడంతో ఈ ఏడాది బోనాల వేడుకల్లో ఆయన లేని లోటు స్పష్టంగా కనిపించనుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమతో కలిసిమెలిసి ఉండే దుర్గన్న ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేక బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం ఉదయం దుర్గన్న మరణ వార్త అందరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. మృతదేహాన్ని చూసేందుకు బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. బోనాల ద్వారా గ్రామస్తుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దుర్గన్న జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని పలువురు పేర్కొన్నారు.

# క్రీడా ప్రతిభను వెలికితీయడమే ప్రధాన ఉద్దేశ్యం

**మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి**

**రంగంపేటలో ముగిసిన మండల స్థాయి క్రీడలు**

**కొల్చారం, సెప్టెంబర్ 09**




క్రీడా ప్రతిభకు వేదికగా మండల స్థాయి పోటీలు ఘనంగా ముగిసిన క్రీడా కార్యక్రమా లు కొల్చారం మండలం లోని రంగంపేట గ్రామంలో మండల స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలం లోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయు లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి మాట్లా డుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం తో పాటు, వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే క్రీడా పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతా యని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయు లు, పీడీలు ప్రతాప్ సింగ్, నవీన్, కాజా పాషా, రుక్మేష్, జానకి, వెంకట లక్ష్మి, నరేందర్, ధరావత్ శ్రీనివాస్, ఓం ప్రకాష్, నరేష్ చారి, నాగరాణి, శోభారాణి, వసంతరాణి, అలవెని తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మండల ఎస్‌జిఎఫ్ కోకో క్రీడలు

**మండల స్థాయిలో బాయ్స్ హై స్కూల్ విజేతగా**

**రెండో స్థానంలో తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులు**

**బాలికల సీనియర్ జూనియర్ విజేతలు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల**

**రణరత్ గా జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థినీలు**

**జూనియర్ కొక్కో ప్రథమ స్థానంలో అక్కన్నపేట్ రెండో స్థానంలో మంజీరా**

**విద్యార్థులకు ఆటలు ఆరోగ్యంతో పాటు భవిష్యత్తులో ఎంతో అవసరం**

**జిల్లా ఎజిఎఫ్ సెక్రెటరీ బి నాగరాజు**





**రామాయంపేట సెప్టెంబర్ 9,**

సెకండరీ పాఠశాల క్రీడలు రామాయంపేట మండల స్థాయిలో కోకో ఆట బుధవారం ప్రభుత్వ పాఠశాల మైదానంలో నిర్వహించడం జరిగింది ఈ పోటీలలో సుమారుగా 15 కు పైగా జట్టులు పాల్గొన్నారు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా ఈ యొక్క కొక్కో పోటీలో పాల్గొనడం విశేషం ఈ సందర్భంగా ఈ ఆటలను జిల్లా ఎస్జీఎఫ్ సెక్రెటరీ బి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ఎంత అవసరం అన్నారు వారికి ఆరోగ్యం ఆనందంతో పాటు భవిష్యత్తులో క్రీడలు ఎంతో ఉపయోగస్తాయని ఆయన అన్నారు .పేట బాలుర పాఠశాల బాలురుమొదటి సీనియర్ జట్టు మొదటి స్థానాన్ని గెలుచుకునే రెండో స్థానంలో తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులు నిలిచారు. రామాయంపేట సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థులు మొదటి జూనియర్ సీనియర్ స్థానాలను ఆక్రమించుకున్నారు. బాలుర జూనియర్ మండల కుక్క స్థానాన్ని అక్కన్నపేట్ రెండో స్థానాన్ని స్థానిక మంజీరా విద్యార్థులు గెల్చుకున్నారు బాలికల జూనియర్ మరియు సీనియర్ కొక్కో రెండో స్థానాల్లో జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు గెల్చుకున్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానాన్ని విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీడీలు నాగచందర్ కిరణ్ రవి తోపాటు మహిళా పిటిలు శోభ గీత రేఖ ప్రైవేట్ పీఈటీలు జీవన్ శేఖర్ మధు స్వామి రాజు దండు యాదగిరి పాల్గొన్నారు.

# మనం అంగన్వాడి -మన బాధ్యత

**తొమ్మిదవ జాతీయ పోషణ మాసం పోస్టర్ ఆవిష్కరించిన**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




**మెదక్ సెప్టెంబర్ 09**

మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాట్లాడు తూ..మనం అంగన్వాడి -మన బాధ్యత అని, సెప్టెంబరు 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ మాసంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రాధాన్య మిస్తూ ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిశీలనకు 'పోషణ్ అభియాన్'ను నిర్వహిస్తున్నామన్నారు.వారు తీసుకోవాల్సిన ఆహారంపై సూచనలివ్వడం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు.అనంతరం 9వ జాతీయ పోషణ మాసం పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఈఓ రాజు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# నిబంధనల నడుమ గణేష్ ఉత్సవాలు జరగాలి

**మండప నిర్వాహకులకు డీఎస్పీ నరేందర్ గౌడ్ దిశానిర్దేశం**

**నర్సాపూర్ ఆగస్టు 09**



గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిబంధనల నడుము ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక యాదవ సంఘ భవనంలో బుధవారం సీఐ రంగకృష్ణ, ఎస్సై రంజిత్ రెడ్డిల పర్యవేక్షణలో ఉత్సవ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో శాంతి సమావేశం నిర్వహించారు. శాంతి సమావేశానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ హాజరయ్యి మాట్లాడారు... మండపాల వద్ద వాహనాల రాకపోకలకు, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలన్నారు. అనంతరం గణేశ్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్ల కోసం పట్టణంలోని రాయరావు చెరువును పరిశీలించారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, కమిషనర్ సాయికుమార్, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రంగంపేటలో ఉచిత వైద్య శిబిరం

**పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయం**

**డి సి ఎం ఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్**

**కొల్చారం, సెప్టెంబర్ 9**



మండలంలోని రంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్ ఆధ్వర్యం లో హైదరాబాద్‌కు చెందిన సింధు హాస్పిటల్ వైద్య బృందం ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించింది. రమేష్ కుమార్ రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు గుండె సంబంధిత వ్యాధు లు, గైనకాలజీ, షుగర్, బీపీ, రక్త పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు అవసరమైన వైద్య పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణులైన వైద్యుల ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య లను సంప్రదించాలని వైద్యులు సూచించారు.